సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం ౹ 14 ౹ జూలై ౹ 2024



ఆశ్రం రజతోత్సవ వేళ..

ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పేదలకు ఏడాది పాటు వైద్య సేవలు అందించనున్నామని ఆశ్రం యాజమాన్యం వెల్లడించింది. 8లో ▸



శిరస్త్రాణంతో ప్రాణాలు భద్రం

హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్నవారిని అభినందిస్తూ గూలాజీలు, చాక్లెట్లు ఇవ్వడం వంటి కార్యక్రమాలతో హెల్మెట్ వాడకం పెరిగింది. 8లో ▸



ఇద్దరు యువకుల దుర్మరణం

కైకలూరు మండలం వేమవరప్పాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

కొత్త ఎస్పీగా నయీమ్ అస్మి



అద్నాన్ నయీమ్ అస్మి

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా అద్నాన్ నయీమ్ అస్మి నియమితులయ్యారు. కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న అస్మి రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. ఇంతవరకు పశ్చిమ ఎస్పీగా పనిచేస్తున్న వేజెండ్ల అజిత విశాఖపట్నం సిటీ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీఅయ్యారు.

ఏలూరు ఎస్పీగా శివకిషోర్



కొమ్మి ప్రతాప శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా కొత్త ఎస్పీగా కొమ్మి ప్రతాప శివకిషోర్ నియమితులయ్యారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి సబ్‌డివిజన్‌లో అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన శివకిషోర్ 2015లో ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. తొలుత సెంట్రల్ ఇంటెలిజెన్స్‌లో సీనియర్ డేటా సైంటిస్ట్‌గా ఉద్యోగం చేశారు. 2018లో సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 2019 ఐపీఎస్ బ్యాచ్‌లో విధుల్లో చేరారు. 2022లో ప్రైమ్ మినిస్టర్ సిల్వర్ అవార్డుకు ఎంపికయ్యారు. శివకిషోర్ సతీమణి ధాత్రిరెడ్డి ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్నారు.

ఎస్పీ మేరీ ప్రశాంతి బదిలీ

జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతిని రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. పోలీస్ కమిషనరేట్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లా దస్తావేజుల లేఖర్ల కమిటీ ఎంపిక



నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా దస్తావేజుల లేఖర్ల కమిటీ

భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా దస్తావేజు లేఖర్ల సమావేశం ఏలూరులో జరిగినట్లు ఆ సంఘ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన తాళ్లూరి మధు శనివారం తెలిపారు. లేఖర్ల సంఘం అధ్యక్షుడిగా ఎస్.నాగరాజు (ఏలూరు), ఉపాధ్యక్షుడిగా జి.తాతాజీ, జనరల్ సెక్రటరీగా తాళ్లూరి మధు(భీమవరం), ట్రెజరర్‌గా ఎం.రవి (అనంతపల్లి), జాయింట్ సెక్రటరీగా పీవీఎస్ ప్రసాద్(తాడేపల్లిగూడెం), శ్రీరామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో దస్తావేజు లేఖర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవీ సుబ్బారావు, డీ.సుధాకర్ కోరారు. శనివారం స్థానిక అశోక్ నగర్‌లో నిర్వహించిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ తమ సమస్యలను ముఖ్యమంత్రికి చెప్పుకోవడానికి అవకాశం కల్పించాలని రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను త్వరలో కోరనున్నట్లు చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా శ్రీనివాస్

యలమంచిలి: పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా యలమంచిలి పంచాయతీ కార్యదర్శి పాలా శారదా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం పంచాయతీ కార్యాలయంలో శనివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దేవాబత్తుల నాగదేవి, కోశాధికారిగా సుంకర వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జీవీఎల్ నరసింహారావు, కెవీ రామారావు, వీఎస్ కల్యాణి, సీహెచ్ చంటిబాబు, పి.వీర్రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా బ్రహ్మం, బి.సతీష్‌కుమార్, వై.మునిరాజు, జీవీటీ నాయుడు, జి.రాధాలక్ష్మి ప్రశాంతిని ఎన్నుకున్నారు.

భీమవరంలో 70 మి.మీ. వర్షం

భీమవరం: శనివారం భీమవరంలో అత్యధికంగా 70.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 20 మండలాల పరిధిలో 825.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా జిల్లా సరాసరి 41.3 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సమాచారశాఖ తెలిపింది. ఉండిలో 67.2 మిల్లీమీటర్లు, నరసాపురంలో 64.6, యలమంచిలిలో 64, పాలకొల్లులో 55.4, ఇరగవరంలో 54, ఆకివీడులో 50.2, మొగల్తూరులో 49.2, అత్తిలిలో 47.8, పాలకోడేరులో 40.8, ఆచంటలో 40.2, పోడూరులో 33.6, వీరవాసరంలో 30.2, పెనుమంట్రలో 29.4, పెనుగొండలో 26.6, గణపవరంలో 23.6, కాళ్లలో 17.4, తాడేపల్లిగూడెంలో 22.2, పెంటపాడులో 17, తణుకులో 21.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పని భారం.. బదిలీకి దూరం

- రెండు, మూడు మండలాలకు ఒక్కరే ఎంఈవో
- ఎంఈవోలకు భారమవుతున్న అదనపు బాధ్యతలు
- విద్యా సంవత్సరం ప్రారంభంతో సతమతం



ఏలూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించి, విద్యార్థులకు ఆయా సౌకర్యాలు అందేలా ప్రభుత్వ పథకాలు అమలు చేసే బాధ్యతలు నిర్వహించే ఎంఈవోల పరిస్థితి దారుణంగా తయారైంది. ఒక్క ఎంఈఓ రెండు మూడు మండలాలకు బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో పనిభారం ఎక్కువై ఆందోళన చెందుతున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచిపోయినా.. విద్యారంగానికి సంబంధించి నూతన కూటమి ప్రభుత్వానికి ఇప్పటికీ స్పష్టత లేదు. గత ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టడం వల్ల ఎలాంటి సమస్యలూ లేకుండా ముందుకు సాగేది. అమ్మ ఒడి పథకం స్థానంలో తల్లికి వందనం పథకాన్ని ప్రవేశపెట్టిన కొత్త ప్రభుత్వం ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తానని చెప్పి పూర్తి స్థాయి స్పష్టత ఇవ్వలేదు. విద్యాకానుక స్థానంలో స్కూల్ కిట్లు పేరు మార్చి విద్యార్థులకు విద్యా విషయక వస్తువులు అందించడంలో విఫలమైంది. గత ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఒక్కొక్క విద్యార్థికి మూడు జతల యూనిఫాం ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం ఒక్క జత కూడా ఇవ్వలేదు. దీంతో వీటన్నింటి పర్యవేక్షణ బాధ్యతలు చూడలేక ఎంఈఓలు తంటాలు పడుతున్నారు.

మండల స్థాయిలో ఒకే ఎంఈవో అన్ని పనులూ చేసుకోవడంలో పని ఒత్తిడికి గురవుతున్నారని గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కొత్తగా ఎంఈఓ -2 పోస్టులను సృష్టించింది. ఈ ఎంఈవో -2 బాధ్యతలను అర్హులైన సీనియర్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి అప్పగించారు. దీంతో అప్పటి వరకూ మండలాలల్లో ఒకరికి ఇంకొకరు తోడై పనులు సులభంగా చేసుకుంటూ వస్తున్నారు. కొత్త ప్రభుత్వం అస్పష్టమైన విధానాల వల్ల వీరు ఎప్పుడు ఏం చేయాలో తోచక గందరగోళ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒక్కో ఎంఈవో రెండు మూడు స్థానాల్లో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి రావడంతో మరింత భారంగా మారింది.

బదిలీలకు దూరం : గత ఏడేళ్లుగా బదిలీలు చేపట్టకపోవడంతో ఎంఈవోల్లో అసంతృప్తి నెలకొంది. 2017లో చివరి సారిగా బదిలీలు చేయగా అప్పటి నుంచి ఒకే స్థానంలో పని చేయాల్సి వస్తోందని, దీని వల్ల బిడ్డల చదువులకు, కుటుంబ అవసరాలకు ఇబ్బందిపడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘకాలం ఒకే ప్రాంతంలో పని చేస్తే అక్కడ అవినీతి జరిగే అవకాశం ఉంటుందని కొంత మంది ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం వెంటనే పదోన్నతి కల్పించి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

పని ఒత్తిడితో భారంగా విధులు

విధుల పరంగా ఒక మండలంలోని అన్ని పాఠశాలలనూ ఎంఈవో -1 పర్యవేక్షించాల్సి ఉంటుంది. దాంతో పాటు మండలంలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలి. విద్యార్థుల హాజరు శాతాన్ని పర్యవేక్షించాలి. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై దృష్టి సారించాలి. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కుక్, హెల్పర్లకు జీతాలు, అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు జీతాల బిల్లులు తయారు చేయించాలి. ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును పర్యవేక్షించాలి. ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, ప్రొటోకాల్ విధులు నిర్వహించాలి. ఎంఈవో-2లు పాఠశాలలు, విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పర్యవేక్షించాలి. సౌకర్యాల కల్పన, గోరుముద్ద స్థానంలో వచ్చిన పీఎం పోషణ, అమ్మ ఒడి స్థానంలో వచ్చిన తల్లికి వందనం, విద్యాకానుక స్థానంలో వచ్చిన స్టూడెంట్ కిట్స్ విద్యార్థులకు అందజేయడం, నాడు-నేడు స్థానంలో తీసుకువచ్చిన స్కూల్ ఇన్‌ఫ్రా వంటి పథకాలను అమలు చేయాల్సింది వీరే. ఇన్ని పనులను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నిర్వహించాల్సి రావడం వీరికి తలకుమించిన భారంగా పరిణమించింది.

ఏలూరు జిల్లాలో 10 మండలాలకు ఇన్‌చార్జులే..

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొంతమంది ఎంఈఓలు ఒకటికి మించి అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సిన పరిస్థితి. పనిభారం తమ ఆరోగ్యాలపై కూడా ప్రభావం చూపుతోందని కొంతమంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం 28 మండలాలకు కేవలం 18 మండలాలకే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. మిగిలిన 10 మండలాలకు ఆయా మండలాల సమీపంలోని మండలాల్లో పని చేస్తున్న ఎంఈఓలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏలూరు మండలానికి సంబంధించి ఏలూరు ఉప విద్యాశాఖాధికారి ఏలూరు ఎంఈవో-1 గా, కలిదిండి ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్నారు. నూజివీడు ఉప విద్యాశాఖాధికారి నూజివీడు ఎంఈవో-1గా, ముదినేపల్లి ఎంఈవో-1, ముసునూరు ఎంఈవో -1 మొత్తం నాలుగు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పోలవరం ఎంఈవో అదనంగా కొయ్యలగూడెం ఎంఈవో-1గా, బుట్టాయగూడెం ఎంఈవో కుక్కునూరు ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు ఎంఈవో-1 తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆగిరిపల్లి ఎంఈవో-1 చాట్రాయికి, భీమడోలు ఎంఈవో -1 ద్వారకా తిరుమలకు, కైకలూరు ఎంఈవో -1 మండవల్లికి, జీలుగుమిల్లి ఎంఈవో -1 వేలేరుపాడుకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో 19 మండలాలు ఉండగా వాటిలో భీమవరం, ఆచంట, యలమంచిలి, ఉండి, కాళ్ళ మండలాలకు ఇతర మండలాలకు చెందిన ఎంఈఓలు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, ఎంఈవో -2లో రెండు స్థానాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు.

పేరుపాలెంలో కేంద్ర బృందం పర్యటన



పేరుపాలెం పిడకాలవారిపేటలో గ్రామస్తులతో సమావేశమైన కేంద్ర బృందం సభ్యులు

మొగల్తూరు/నరసాపురం రూరల్: కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన జలశక్తి అభియాన్ కేంద్ర బృంద సభ్యులు శనివారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పర్యటించారు. జలశక్తి అభియాన్ పథకంలో భాగంగా గ్రామాల్లో తవ్విన కాలువలు, చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. కేంద్ర నోడల్ బృందం సభ్యులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్-ఫార్మర్స్ వెల్ఫేర్ డైరక్టర్ డాక్టర్ జితేంద్రసింగ్, బృంద సభ్యులు పర్యటించారు. గ్రామాల్లో చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటడం, మొక్కల పెంపకం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పేరుపాలెం నార్త్ పంచాయతీలోని పిడకాలవారిపేటలో ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో జితేంద్ర సింగ్ మాట్లాడారు. జలజీవన్ మిషన్‌లో చేపట్టిన పనులు అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది అమృత్ సరోవర్ పథకంలో తవ్విన చెరువును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త మానిక, కేంద్ర జలశక్తి అభియాన్‌కు చెందిన నోడల్ అధికారి ఎం.ప్రభాకరరావు, ఎంపీడీవో వి.బాబ్జిరాజు, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు బృందం నరసాపురం మండలంలోని సీతారామపురం సౌత్, సీతారామపురం నార్త్, యర్రంశెట్టివారి పాలెం గ్రామాల్లోనూ పర్యటించింది.

● ఆత్మీయ కలయిక



తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లాలో పార్టీ పరిస్థితి, ఇతర అంశాలపై వివరించారు.

- సాక్షి, అమరావతి

రోగులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

పాలకొల్లు ఆసుపత్రి భవనం పనులు త్వరలో పూర్తి



ప్రమాదకరంగా ఉన్న పాలకొల్లు ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ ఆసుపత్రి శ్లాబ్ పెచ్చులు ఊడిపోవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉన్న రోగులను మాత్రమే పంపించామని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న ప్రతి వార్డును పర్యవేక్షించారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న కొందరు పేషెంట్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రూ.16 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగిన తరువాత ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. నిత్యం ఆసుపత్రికి వచ్చే ఓపీ పేషెంట్లకు వైద్య పరీక్షలు మామూలుగానే జరుగుతున్నాయని చెప్పారు. ఒకవేళ ఎవరికైనా మేజర్ సమస్య ఉంటే అందుబాటులో నరసాపురం, పెనుగొండ, ఆచంట ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం నూతన ఆసుపత్రిని పరిశీలించారు. నెలరోజుల్లో పనులు మొత్తం పూర్తిచేయాలని ఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఏపీ ఎంఎస్ఐడీసీ డీఈఈ ఎం శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ సూపరింటిండెంట్ రవికుమార్, వైద్యులు డాక్టర్ వర్మ, డాక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఆస్పత్రిని శనివారం రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన ఆసుపత్రి భవనంలో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు.

విద్యతోనే అభివృద్ధి కల సాకారం

కలెక్టర్ నాగరాణి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం: ఉన్నత చదువులతోనే అభివృద్ధి కల సాకారమతుందని కలెక్టర్ సి.నాగరాణి చెప్పారు. శనివారం నరసాపురం మండలం వేములదీవి ఈస్ట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక తుఫాన్ రక్షిత భవనంలో మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. స్థానికంగా వేట సాగించే విధానాలు, ఇబ్బందులు, తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనే కష్టాలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంట్లో పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటే మొత్తం కుటుంబ పరిస్థితి మారుతుందని చెప్పారు. మత్స్యకార గ్రామాల్లో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామన్నారు. తీరగ్రామాల్లో మత్స్యకారుల సమస్యలను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కలెక్టర్‌కు వివరించారు. తాగునీరు, రోడ్ల సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు పొత్తూరి రామరాజు, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అంగ్రాజు చల్లారావు పాల్గొన్నారు.

జీపీఎస్ జీవో విడుదల దుర్మార్గం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షగా ఉంటే, ప్రభుత్వం పాత తేదీతో జీపీఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ జీఓను విడుదల చేయడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుంచి సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనని ఖండించారు. ఈ రాజ పత్రాన్ని రద్దు చేయాలని, తక్షణం పాత పెన్షన్ పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణం అమలు చేసి 2003 డీఎస్సీ ద్వారా అపాయింట్ అయిన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి కోరారు.

జీపీఎస్ అమలు బాధాకరం : రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరుస్తారని అందరూ ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో జీపీఎస్ చట్టాన్ని అమలు చేయడానికి సిద్ధమవడం బాధాకరమని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బీ.రెడ్డి దొర ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. జీపీఎస్‌తో పదవీ విరమణ తరువాత పీఆర్‌సీగాని, హెల్త్ కార్డులు గానీ వర్తించవని, ఉద్యోగి కట్టిన 10 శాతం గ్రాంటును, ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. 33 సంవత్సరాల సర్వీసు ఉంటేనే 50 శాతం పెన్షన్ వస్తుందని, సర్వీస్ తగ్గితే పెన్షన్ తగ్గుతుందని ఇలాంటి అనేక నష్టాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 2023 అక్టోబర్ 20 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని ఏలూరు జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

జీపీఎస్‌ను రద్దు చేయాలి

తణుకు అర్బన్: పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించే జీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తూ కొత్త ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ అన్నారు. స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూలులో శనివారం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ మాట్లాడుతూ జీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు.

జోరు వానలోనూ.. భక్తుల జోరు



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ



గొడుగులతో ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: జోరు వానలోనూ.. శ్రీవారి భక్తుల జోరు తగ్గలేదు. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోను రెండో శనివారం సెలవుదినం కావడంతో వేలాది మంది భక్తులు శనివారం చినవెంకన్నను దర్శించారు. దాంతో క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. వర్షాన్ని సైతం భక్తులు లెక్కచేయలేదు. స్వామివారి దర్శనానంతరం ఆలయం నుంచి బయటకు వెళ్లే క్యూలైన్‌కు షెడ్ లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డీఎన్నార్ కళాశాలకు అటానమస్ హోదా



అటానమస్ సర్టిఫికెట్ చూపుతున్న డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు నర్సింహరాజు

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్వయం ప్రతిపత్తి (అటానమస్)స్థాయిని కల్పించినట్లు కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు చెప్పారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలో తమ కళాశాల దశాబ్ద కాలంగా అన్ని వర్గాల విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువచేసి ఎందరో విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసిందన్నారు. డీఎన్నార్ కళాశాల అందిస్తున్న విద్య, శిక్షణ, ప్లేస్‌మెంట్స్ వంటి నాణ్యత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే నాక్ అత్యుత్తమ గ్రేడ్ ఏ++ అందించిందని, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు గుర్తింపు లభించిందన్నారు. అటానమస్‌తో కళాశాల అభివృద్ధికి సొంతగా నిర్ణయాలు తీసుకునే అవకాశంతోపాటు విద్యా విధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్‌లో మార్పులకు వీలవుతుందని చెప్పారు. సామాజిక సేవా దృక్పథంతో విద్యా బోధన, ఆధునిక సాంకేతికత ఆధారంగా కోర్సుల నిర్వహణ, మెమొరీ బేస్డ్ విద్యావిధానం ఏర్పాటుకు వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ఏవో పి.రామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ ఎం.అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చినవెంకన్న సేవలో ఆర్‌టీఐ కమిషనర్



ఆర్‌టీఐ కమిషనర్ సునీల్‌కు స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఆలయ డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రాన్ని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ చవలి సునీల్ శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం డీఈఓ బాబురావు, ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, పి.నటరాజారావు, వాసు, ఆర్‌ఐ నాగరాజు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

శిరస్త్రాణంతో ప్రాణాపాయం దూరం

- ప్రయాణంలో వాహనచోదకుల తలకు రక్షణ కవచంగా హెల్మెట్
- హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ హైకోర్టు ఆదేశాలు
- రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గింపునకు చర్యలు
- వాహనచోదకుల్లో అవగాహన పెంచేలా పోలీసు శాఖ దృష్టి



భీమవరంలో వాహనచోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

భీమవరం : వాహనచోదకుల భద్రతకు, రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో హెల్మెట్ వాకడాన్ని తప్పనిసరి చేస్తూ పోలీసు శాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. మోటారు వాహన చట్టం కింద 1988 సంవత్సరంలోనే హెల్మెట్ ధారణ తప్పనిసరి చేసినప్పటికీ నేటికీ అనేక మంది వాహనచోదకులు హెల్మెట్ వాడకాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. జిల్లాలో గత ఏడాది అప్పటి ఎస్పీ యు.రవిప్రకాష్ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిబంధనలు విధించి వాహనం నడిపేటపుడు హెల్మెట్ లేకుంటే పోలీసులు తనిఖీల సమయంలో జరిమానా విధించడమే కాక అప్పటికప్పుడు వాహనచోదకులతో హెల్మెట్ కొనుగోలు చేయించి ధరించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్నవారిని అభినందిస్తూ గులాబీ పూలు, చాక్లెట్స్ ఇచ్చి వారిని అభినందించడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో హెల్మెట్ వాడకం పెరిగింది. దీని కోసం ఎస్పీ రవిప్రకాష్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గత ఏడాది ఎస్పీ రవిప్రకాష్ బదిలీ కావడం, అనంతరం ఎన్నికల విధుల్లో నిమగ్నమైన పోలీసు శాఖ దీనిపై దృష్టి సారించలేదు.

కోర్టు ఆదేశాలతో..

దేశంలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేల సంఖ్యలో మృత్యువాత పడుతుండడంతో ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చినా అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మోటారు వాహన చట్టం సక్రమంగా అమలుగాక ఏటా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య పెరుగుతోందని ఓ న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల కోర్టు వెలువరించిన తీర్పులో కేంద్ర మోటారు వాహన చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి ట్రాఫిక్ జరిమానాలు భారీగా విధించాలని ఆదేశించింది. పరిస్థితులను బట్టి డ్రైవింగ్ లైసెన్స్ మూడు నెలల వరకు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోర్టు తీర్పులో సూచించింది. దీనితో పోలీసు శాఖ హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ కార్యాచరణ చేపట్టింది.

తలకు హెల్మెట్ రక్షణ కవచం వంటిది

మోటారు వాహనచోదకులు రోడ్డు ప్రమాదాల బారిన పడితే హెల్మెట్ తల, మెడకు తీవ్రమైన గాయం కాకుండా కాపాడుతుంది. ముఖానికి కప్పబడి ఉండేలా హెల్మెట్ ఉంటే దుమ్ము, గాలి వంటి నుంచి రక్షణ కల్పిస్తుంది. దీనికి గాను ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చు. వాహన చట్ట నిబంధనల గురించి, హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకుంటే కలిగే ప్రాణ నష్టాన్ని తెలియజేసేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నాణ్యమైన, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండే తేలికపాటి హెల్మెట్లను ఎంపిక చేసుకోవాలి. రోడ్లపై విధులు, వాహన తనిఖీలు నిర్వహించే సమయంలో పోలీసులు తప్పనిసరిగా బాడీ కెమెరాలు ధరించేలా చర్యలు తీసుకోవాలి. మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడమేగాక జరిమానా విధించాలి.

ప్రాణం విలువ గ్రహించాలి



పోలీసుల బలవంతంతోగాని జరిమానాలు వేస్తారనే భయంతో హెల్మెట్ ధరించడం కంటే ప్రమాదవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాలు వల్ల కలిగే నష్టాలను వాహనచోదకులు గుర్తించాలి. ప్రాణం విలువను తెలుసుకోవాలి. వాహనం నడిపేటపుడు తనకో కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తించుకోవాలి. తల జుట్టు చెదిరిపోతుందనో సెల్‌ఫోన్ మాట్లాడే అవకాశం ఉండదనే కారణంగా హెల్మెట్‌కు దూరం కావద్దు. కొంతమంది వాహనచోదకులు హెల్మెట్ ఉన్నా వెనుక కూర్చునవారిలో చేతిలో పెట్టడం లేదా వెనుక లాక్ చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. దీనిపై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే నివాసం నుంచి మోటారు సైకిల్‌పై బయటకు వస్తున్న భర్త, కుటుంబ సభ్యులకు హెల్మెట్ గుర్తు చేసే బాధ్యతను భార్య, తల్లిదండ్రులు తీసుకోవాలి.

– వి నారాయణస్వామిరెడ్డి, డీఎస్పీ, భీమవరం

యువతి ఆచూకీ లభ్యం



కల్యాణితో తల్లిదండ్రులు, రైల్వే పోలీసులు

భీమవరం: రైలులో ప్రయాణం చేస్తూ తప్పిపోయిన ఓ యువతిని రైల్వే పోలీసులు హైదరాబాద్‌లో గుర్తించి ఐసీడీఎస్ సెంటర్‌కు అప్పగించినట్లు భీమవరం రైల్వే ఎస్‌ఐ పీటీవీ రమణ శనివారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాళ్ల మండలం ఆనందపురం గ్రామానికి చెందిన కె.పెద్దిరాజు కుమార్తె కల్యాణి కాకినాడలోని ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతోంది. అయితే గత నెల 7వ తేదీన పెద్దిరాజు, కల్యాణి కాకినాడ నుంచి రైలులో భీమవరం వస్తుండగా మధ్యలో తప్పిపోయింది. దీంతో పెద్దిరాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు కల్యాణి హైదరాబాద్‌లోని మాదాపూర్ హాస్టల్ ఉన్నట్లు ఆమె వినియోగిస్తున్న ఫోన్‌ను ట్రేస్ చేయడం ద్వారా గుర్తించారు. దీంతో యువతిని ఈనెల 12వ తేదీన హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించడానికి ప్రయత్నించగా కల్యాణి వారి వద్దకు వెళ్లడానికి నిరాకరించింది. దీంతో పాలకోడేరు మండలం విస్సాకోడేరులోని ఐసీడీఎస్ అధికారులకు యువతిని అప్పగించినట్లు ఎస్సై రమణ చెప్పారు.

ఆశ్రం రజతోత్సవ వేళ.. ఉచిత వైద్య సేవలు



ఆశ్రం ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రతీదేవి తదితరులు

ఏలూరు రూరల్: అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఆశ్రం) స్థాపించి ఈ ఏడాది జూలై 14వ తేదీ నాటికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పేదలకు ఏడాది పాటు వైద్య సేవలు అందించనున్నామని ఆశ్రం డైరెక్టర్ గోకరాజు రతీదేవి చెప్పారు. శనివారం ఆశ్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రజతోత్సవం సందర్భంగా ఆశ్రం యాజమాన్యం సేవా కార్యక్రమాలు చేపట్టనుందని, దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే 100 ఉచిత శస్త్రచికిత్సలు, మరో 100 ఉచిత డెలివరీలు నిర్వహిస్తామన్నారు. ఖరీదైన కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను రూ.90 వేలకే చేస్తామన్నారు. డయాగ్నోస్టిక్స్‌తో పాటు పలు రకాల శస్త్రచికిత్సలు సైతం తక్కువ ఖర్చుతో పేదలకు అందిస్తామన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.పార్ధసారథి మాట్లాడుతూ ఆశ్రం వ్యవస్థాపకులు గోకరాజు గంగరాజు దార్శనికతతో 25 ఏళ్లలో ఆశ్రం అనేక విజయాలు సాధించిందని గుర్తు చేశారు. 2000లో 100 మంది ఎంబీబీఎస్ విద్యార్థులతో ప్రారంభమైన ఆశ్రం ప్రస్థానం పోస్టు గాడ్యుయేషన్, సూపర్‌స్పెషాలిటీ స్థాయికి చేరిందని కొనియాడారు. రజతోత్సవాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో పాటు వైద్యులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఆశ్రం చైర్మన్ గంగరాజు పుట్టినరోజును పురస్కరించుకుని ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నామని వివరించారు. అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కె.అంజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్, సీఈఓ డాక్టర్ కె.హనుమంతరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శాంతయ్య, డాక్టర్ ఎస్.వేణుగోపాలరాజు, ఎస్.రాజరాజన్ పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల దుర్మరణం

- రోడ్డుపక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్
- తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఒకరు, ఏలూరుకు తరలిస్తుండగా మరొకరు మృతి
- వేమవరప్పాడులో ఘటన
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు





మృతుడు చావలి దుర్గాప్రసాద్ , చావలి దుర్గాప్రసాద్ (ఫైల్)





మృతుడు బోడావుల దుర్గాప్రసాద్, దుర్గాప్రసాద్ (ఫైల్)

కైకలూరు: వేమవరప్పాడులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను చీకటిలో గమనించక ద్విచక్రవాహనంతో ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చావలి కిషోర్ కుమారుడు దుర్గాప్రసాద్ (19), బోడావుల నాగరాజు కుమారుడు దుర్గాప్రసాద్ (18) స్నేహితులు. ఇంటర్ వరకు చదివి వలల పట్టుబడి పనులు, వ్యవసాయ పనులు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి సమీప కోరుకొల్లు గ్రామానికి పనిపై ఇద్దరూ ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ ప్రారంభంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను చీకటిలో గమనించకుండా దానిని ఢీకొట్టారు. తీవ్రగాయాలపాలైన వీరిని స్థానికులు కైకలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే చావలి దుర్గాప్రసాద్ మరణించాడు. బోడావుల దుర్గాప్రసాద్‌ను ఏలూరులో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. మృతుడు చావలి దుర్గాప్రసాద్‌కు ఇద్దరు అక్కలు ఉన్నారు. వివాహాలు జరిగాయి. తండ్రి కిషోర్‌కు ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేశారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటాడనుకున్న కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మరో మృతుడు బోడావుల దుర్గాప్రసాద్ తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు ఉన్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కైకలూరు టౌన్ ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కైకలూరులో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను నిలిపి ఉంచిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మరణించడంతో వేమవరప్పాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

‘మూడంచెల’ను పటిష్టంగా అమలు చేయాలి



ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్) : పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం మూడంచెల వ్యవస్థను పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి విజ్ఞప్తి చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదినోత్సవం సందర్భంగా ఆమెకు శనివారం పూలబొకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అనే వ్యవస్థలు 1994 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రత్యేక స్థానం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ మూడు వ్యవస్థలకు పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రత్యేక హక్కులు, అధికారాలు సంక్రమించినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు విఫలమవుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ పదవులు అనేవి ప్రత్యేక వ్యవస్థలు అని అన్నారు. వీటి అధికారాలు, విధులను నిర్వీర్యం చేసేలా రాజకీయ పార్టీలు వ్యవహరించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎమ్మెల్యేలు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తూ మూడంచెల వ్యవస్థలో వివిధ పదవుల్లో ఉన్న వారి విధులకు, హక్కులకు భంగం కలిగించడం కన్పిస్తుందన్నారు. వీరికి స్థానిక సంస్థల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వారి విధులు, హక్కులకు భంగం కలిగిస్తున్నారని, ఇటువంటి చర్యలను రాష్ట్ర ఎస్సీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం తరుపున ఖండిస్తున్నట్లు చెప్పారు. కేబినెట్ హోదా కలిగిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తన హక్కులను వినియోగించి ఉమ్మడి జిల్లా పరిధిలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం చేసే విధంగా పనిచేయాలని సంతోష్ కుమార్ కోరారు.

ఉపాధ్యాయ సంఘాలతో సమస్యలపై చర్చించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న ఆంజనేయులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు చేసే బాధ్యతను పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకత్వం తీసుకోవాలని పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు రాష్ట్ర నాయకులకు వినతిపత్రం సమర్పించారు. విజయవాడ గాంధీనగర్‌లో జరిగిన పీఆర్‌టీయూ రాష్ట్ర సమావేశం సందర్భంగా ఏలూరు జిల్లా తరపున వినతిపత్రం అందజేసిన వివరాలను ఆయన ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. జీపీఎస్‌కు సంబంధించి విడుదలైన గెజిట్ విషయంలో సీపీఎస్ ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరామన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపచేసే విధంగా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కార్డు అన్ని వ్యాధులకూ, గుర్తింపు పొందిన అన్ని ఆసుపత్రుల్లో వినియోగంలోకి తెచ్చేలా కృషి చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు. అలాగే పదోన్నతులను పునరుద్ధరించాలని, బదిలీలు చేపట్టాలని, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను సర్దుబాటు చేయాలని కోరామన్నారు. వినతిపత్రాన్ని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్‌లకు సమర్పించామని తెలిపారు.

అమ్మకు వందనంపై మాట తప్పిన కూటమి

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వినిస్టన్ బాబు



పాలకొల్లు అర్బన్: అమ్మకి వందనంపై కూటమి ప్రభుత్వం మాట తప్పి చదువుకునే విద్యార్థులను సీఎం చంద్రబాబునాయుడు మోసం చేశారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తమ మ్యానిఫెస్టోలో ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి వారి తల్లి బ్యాంక్ ఖాతాకు రూ.15 వేలు జమ చేస్తామని హామీ ఇచ్చి గత రెండు రోజుల క్రితం ఇచ్చిన జీవోలో సరైన స్పష్టత లేకుండా విడుదల చేశారన్నారు. దీంతో చంద్రబాబుని నమ్మి ఓట్లు వేసిన తల్లులు మోసపోయామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికల ముందు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకంలో చదువుకునే విద్యార్థి తల్లి ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తానని మాట ఇచ్చి ఆ మాట ప్రకారం ఐదేళ్లు తల్లుల ఖాతాల్లో ఆ సొమ్ములు జమ చేశారన్నారు. అయితే రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మాజీ సీఎం జగన్‌పై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. చంద్రబాబు మెప్పు పొందడం కోసం మాజీ సీఎం జగన్‌పై బురద జల్లితే వైఎస్సార్ సీపీ శ్రేణులు చూస్తూ ఊరుకోరని వినిస్టన్‌బాబు హెచ్చరించారు.

పొలాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా వర్షం పడేటప్పుడు పొలాల్లో ఉన్న విద్యుత్ మోటర్లు ఆన్ చేయవద్దని, విద్యుత్ స్తంభాలు పొలాల్లో ఒరిగి పడే పరిస్థితి ఉంటే తక్షణమే సమీపంలో అందుబాటులో ఉన్న విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్తు మోటర్ల వైర్లు తెగి ఉంటే రైతులు వాటిని ముట్టుకోకుండా తగు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కొబ్బరి దింపు కార్మికుడి మృతి

పెనుగొండ: ఆచంట పంచాయతీ కవురుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొబ్బరి దింపు కార్మికుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుమంచిలి ఇసుక గరువుకు చెందిన కొబ్బరి దింపు కార్మికుడు కరిణ సుందరరావు (54) శనివారం బైక్‌పై ఆచంట పెదపేటలోని బంధువుల ఇంట్లో పుట్టినరోజు వేడుకకు హాజరై సాయంత్రం తిరిగి వెళుతుండగా కవురుపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుందరరావుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించడంతో 108 వాహనంలో తీసుకుని వెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆచంట ఎస్సై రాజ్‌కుమార్ చెప్పారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువకుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై వై.మంగయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన వెంపాటి వెంకట శివసాయిరాం ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ నెల 7న ఉద్యోగ ప్రయత్నం నిమిత్తం బెంగుళూరు వెళుతున్నట్లు కుటుంబసభ్యులకు చెప్పాడు. అప్పటి నుంచి అతనికి ఫోన్ చేస్తున్నా పనిచేయడంలేదని, కుమారుడు ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని, ఆచూకీ కనుగొనాలని తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

లెన్స్ టెక్నాలజీతో లక్షలాది మందికి చూపు



తెలంగాణా అప్తమాలజీ సొసైటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: కంటి శుక్లం శస్త్రచికిత్సలో అత్యాధునిక లెన్స్ టెక్నాలజీతో లక్షలాది మంది తిరిగి చూపులు పొందుతున్నారని పట్టణానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జి.సందీప్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆప్తమాలజికల్ సొసైటీ 9వ వార్షికోత్సవం సదస్సులో శనివారం ఆయన మాట్లాడారు. కంటిశుక్లం దెబ్బతిని చూపు సరిగా లేక ఇబ్బంది చాలామంది పడుతున్నారన్నారు. భూతద్దాలు వంటి కళ్లజోడు వాడడం ఇబ్బందిగా ఉన్న తరుణంలో కంటిలో లెన్సు ఏర్పాటు చేసే ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఇంట్రా ఆక్యులర్ లెన్స్‌తో కంటి శుక్లం సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చన్నారు. తద్వారా ఎక్కువమందికి చూపు ప్రసాదించవచ్చన్నారు. క్యాటరాక్ట్ శస్త్ర చికిత్స ద్వారా తిరిగి సంపూర్ణ నేత్రాలను ప్రసాదించే అవకాశం ఉందన్నారు. సందీప్‌రెడ్డి తెలంగాణా అసోసియేషన్ సత్కరించింది.

చినతాడేపల్లి వద్ద అప్రోచ్ రోడ్డు మంజూరు



చినతాడేపల్లి వద్ద అప్రోచ్ రోడ్డు దుస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి వద్ద జాతీయ రహదారికి అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు మంజూరైంది. ఈ సందర్భంగా ఆ ప్రాంతాన్ని శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు.

వరాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపారు. ఉదయం అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

నేడు 'గూడెం' మండలంలో కేంద్ర బృందం పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లింగారాయుడిగూడెం, జగన్నాథపురం, కడియద్ద గ్రామాల్లో ఆదివారం ఉదయం కేంద్ర బృందం పర్యటించనున్నట్టు ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జలశక్తి అభియాన్, నారీ శక్తి సే జలశక్తి ప్రోగాంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు పరిశీలిస్తారని తెలిపారు.

వ్యాధులకు చెక్ పెట్టండి



అయిభీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

ఆకివీడు: సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టే విధంగా ప్రజలు అప్రమత్తతతో ఉండాలని పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు బి.గోవర్ధిని విజ్ఞప్తి చేశారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా శనివారం అయిభీమవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వస్తున్న అంటువ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ఉపయోగించాలని సూచించారు. గ్రామ పెద్దలు, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, వెంకటలక్ష్మి, రత్న హిల్లరి, హెల్త్ అసిస్టెంట్ బండి దుర్గాప్రసాద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి నాట్లు

- మూడవ సారి వర్షపు నీటిలో
- ఆదిలో హంసపాదుగా రైతాంగం పరిస్థితి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెట్ట ప్రాంతాల్లోని వరి నాట్లు నీట మునిగాయి. ఇప్పటికే మూడుసార్లు నీట మునిగాయి. ప్రధానంగా ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, దండగర్ర, జగన్నాథపురం గ్రామాల్లోని వరి చేలు వర్షపు నీటిలో దర్శనమిస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలలోని నీరు దిగువకు పోయే మార్గాలు లేక వరి చేలలోనే నీరు తిష్ఠ వేస్తుందని రైతులు వాపోతున్నారు. పంట కాలువలను సైతం సమీప రైతాంగం ఆక్రమించుకోవడం, తూరలను మూసివేయడం వంటి కారణాలతో ఈ పరిస్థితి నెలకొంటుందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. మరో మూడు రోజులు వర్షపు నీటిలో నాట్లు ఉంటే దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. నాట్లు దెబ్బతింటే తిరిగి కొనుగోలు చేసే పరిస్థితి లేదంటున్నారు. మరో 24 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువ ఆక్రమణలను తొలగించి, పంట కాలువల ద్వారా వర్షపు నీరు దిగువకు పోయే మార్గాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



మోదుగ గుంట గ్రామంలో నీట మునిగిన వరి నాట్లు



దువ్వలో నీట మునిగిన వరి నాట్లు

ముంపు ముంగిట వరి చేలు

తణుకు టౌన్: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని పల్లపు పంట పొలాలు నీట మునిగాయి. గ్రామాల్లోని మురుగు నీటి కాలువలు నిండిపోవడంతో పంట పొలాల్లోని నీరు నిలిచిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. పంట పొలాల్లో నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని దువ్వ, తేతలి గ్రామాల్లోని సార్వా సాగులో రైతులు ఎక్కువగా స్వర్ణ, 1318 రకాలను మండలంలో రైతులు వరి నాట్లు వేశారు. వర్షాల కారణంగా వరినాట్లు నీట మునిగిపోవడం వలన త్వరగా మురుగునీరు బయటకు రాకపోతే నాట్లు దెబ్బతింటాయనే ఆందోళన రైతులలో నెలకొంది.

"నీరు దిగువకు పోయే మార్గాలు చూడాలి



వర్షాలకు వరి నాట్లలో తిష్ఠ వేసిన నీరు దిగువకు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలి. మరో 24 గంటలు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతాంగం ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించవద్దు.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



దాత నాగేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు శనివారం వేర్వేరుగా రూ.1,60,616 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంకు చెందిన వడ్లపూడి వెంకటరత్నం రూ.1,10,500, పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన గమిని నాగేశ్వరరావు రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

నేడు సంగీత కచేరీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని త్యాగరాజ గానసభ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని డీఎస్ చెరువు సమీపంలోని శ్రీ సత్యసాయి సేవా మందిరంలో ఈ నెల 14వ తేదీ ఆదివారం సాయంత్రం సంగీత కచేరీ నిర్వహిస్తున్నట్లు గాన సభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ వెల్లడించారు.

ప్లాస్టిక్ నిషేధంలో నిర్లక్ష్యం



పెంటపాడులో డ్రెయినేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



వల్లూరుపల్లి మురుగుబోదెకు అడ్డుపడ్డ ప్లాస్టిక్ వ్యర్థాలు

- యథేచ్ఛగా వ్యాపారస్తుల వినియోగం
- అడుగడుగునా బాధ్యతారాహిత్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పెంటపాడు: మానవ మనుగడకే సవాలుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. వంద మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న(సింగిల్‌యూజ్) ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సమాజంలో ప్రతి పౌరుడు ప్లాస్టిక్ నిషేధాన్ని బాధ్యతగా తీసుకొని అమలుచేయాలని సూచించింది. అయితే పల్లెల్లో ప్రజలు ప్లాస్టిక్ నిషేధాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బహిరంగంగానే ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తూ పర్యావరణానికి, ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలును ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడంతో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతుంది. దీనిపై సంబంధిత అధికారులు కొరడా ఝుళిపించి ప్లాస్టిక్ నిషేధం పగడ్బందీగా అమలు జరిగిలే చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రియులు కోరుతున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకొంటున్నప్పటికీ అమలు చేయాల్సిన యంత్రాంగం మాత్రం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం పల్లెల్లో పూర్తి స్థాయిలో చేరక పోవడంతో పెద్ద ఎత్తున వినియోగం పెరిగిపోతోంది. ప్రధానంగా మండలంలో ముదునూరు చిలకంపాడు లాకులు, కె. పెంటపాడు బుడగా జంగాల పేట, పెంటపాడు కునాకరపేట, యానాలపల్లి గ్రామ శివారు అదే విధంగా పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. భాగా పెరిగాక వాటిని తగుల బెడుతున్నారు. రోజు, విడిచి రోజు పారిశుద్ధ్యంపై గ్రామాల్లో శానిటేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. కూరగాయలు, టిఫిన్లు ఇతర ఆహారపదార్థాలు ఇళ్లకు తెచ్చుకోవడానికి, పాలప్యాకెట్లు, డిస్పోడబుల్ ప్లేట్లు ఇలా ఉదయం నుండి రాత్రి వరకు మనిషి ప్రతీ అవసరం లోనూ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తున్నారు.

రోజూ 50 టన్నుల చెత్త

నియోజకవర్గంలో పెంటపాడు, గూడెం మండలాల్లోని గ్రామాల నుంచి నిత్యం సుమారు 50 టన్నుల వరకు చెత్త పోగవుతుందని ఒక అంచనా. ఇందులో సుమారు 3 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. తడి పొడి చెత్త విషయంలో అలసత్వం వహిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకోవాలన్న ఆదేశాలను భేఖాతరు చేస్తున్నారు.

చెత్తను తగల బెడితే ప్రమాదమే..

ప్లాస్టిక్ కాలిస్తే మరింత ప్రమాదమని హెచ్చరిస్తున్నప్పటికి అన్ని రకాల చెత్తతో పాటే ప్లాస్టిక్‌ను కూడా తగుల బెడుతున్నారు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాల్లో ముఖ్యమైంది. ప్లాస్టిక్‌ను మండించమే అని వైద్యులు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ తగల బెట్టకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఇందుకు సంబంధిత ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని కోరుతున్నారు.

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు అవసరం



పెనుగొండలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెనుగొండ: వాతావరణ మార్పులుతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ షఫీద్ అన్నారు. శనివారం పెనుగొండలో జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. మురుగునీరు ఇంటి బయట నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వర్షపు నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వస్తే సత్వరం వైద్యుని సంప్రదించాలని పేర్కొన్నారు. కొబ్బరి డొక్కలు, పాత టైర్లు ఇళ్ల వద్ద ఉంటే దోమలు వ్యాప్తి చేందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అడ్డాల ఉమామహేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌరుల హక్కులను హరించే విధంగా కొత్త క్రిమినల్ చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

తణుకు అర్బన్: భారత రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులతోపాటు స్వేచ్ఛ, సమానత్వం కల్పించిందని, ఆ హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించిందని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి విమర్శించారు. తణుకు బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ జాజువుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశం ద్రోహంగా పరిగణించి క్రిమినల్ కేసును నమోదు చేసే కొత్త క్రిమినల్ చట్టాలను వెంటనే నిలుపుదల చేయాలని, రానున్న రోజుల్లో కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ఉభయగోదావరి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. చట్టాలను ఆమోదించే క్రమంలో ముందుగా న్యాయవాదులతో ఎటువంటి చర్చలు నిర్వహించకుండా ఏకపక్షంగా కొత్త చీకటి క్రిమినల్ చట్టాలను ఆమోదించారని విమర్శించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాసరావు, కోశాధికారి పి.వేణుగోపాలచౌదరి, జిల్లా కమిటీ సభ్యులు పీవీపీ లక్ష్మి, గెద్దాడ విజయభాస్కర్, పి.వెంకట్, పి.రాజారావు, డి.అప్పారావు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ మాస సారె సమర్పణ



ఏలూరుపాడు వీధుల్లో అమ్మవార్లకు సారె సమర్పించేందుకు వచ్చిన మహిళా భక్తులు

కాళ్ల: ఏలూరుపాడు గ్రామంలో కొలువు తీరి ఉన్న అమ్మవార్లకు ఆషాడ మాసం సారె సమర్పణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవతలైన పోలేరమ్మ, కొండాలమ్మ మహాలక్ష్మమ్మ,పుంతలో ముసలమ్మ, ఎల్లమ్మ ,కనక దుర్గాదేవి అమ్మవార్లకు శనివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని గ్రామదేవతలకు ఆషాడమాస సారె బిందులతో గ్రామంలో పురవీధుల గుండా మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో ఉదయం 7:30 గంటలకు శ్రీ శ్రీ పోలేరమ్మ వారి గుడి దగ్గర నుంచి ఆషాడ మాస అమ్మవార్ల సారే మన గ్రామ దేవతలు శ్రీ పోలేరమ్మ, ఎల్లమ్మ,కొండలమ్మ ,మహా లక్ష్మమ్మ,శ్రీ పుంతలో ముసలమ్మ, శ్రీ కనక దుర్గమ్మ అమ్మ వార్లకు పసుపు,కుంకుమ,చీర జాకెట్ ,గాజులు,పువ్వులు,పళ్లతో పాటు సున్ని,సోడిజావ,బెల్లం మిఠాయి, పంచదార లడ్డు,రవ్వ లడ్డు, మురిపి,కాజా,మైసూర్ పాక్, తొక్కుడు లడ్డు,చలిమిడి, బూందీ, అన్ని రకాలు కలిపి సుమారుగా 300 కేజీలు గ్రామ మహిళా భక్తులు గ్రామ దేవతలకు సమర్పించారు. అనంతరం పోలేరమ్మ వద్ద దగ్గర అన్న సమారాధన ఏర్పాటు చేశారు.గ్రామంలోని మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు దాతల సహకారంతో 100 లీటర్ల పాలను వచ్చిన భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మి, ఉండి మాజీఎమ్మెల్యేమంతెన రామరాజు సతీమణి మంతెన సుస్మా,గ్రామ సర్పంచ్ భూపతి రాజు జగ్గరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయరాజు, దాట్లశ్రీనివాసరాజు (సెక్యూరిటీ వాసు), దాట్ల సురేస్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు దాట్ల శ్రీనివాసరాజు, దాట్ల ప్రసాద్ రాజు, వక్కపట్ల హరిబాబు, రమణ, అమ్మవార్ల ఆలయకమిటీ సభ్యులు గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రాయల్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పూర్వ విద్యార్థులు తమ మిత్రుని కటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. పెంటపాడ్ డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1975–78 బ్యాచ్‌లో పి.సత్యనారాయణ డిగ్రీ విద్యనభ్యసించారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో కొట్టాడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన మిత్రులు, పూర్వ విద్యార్థులు రూ.1,05,000 సేకరించి సత్యనారాయణ కుటుంబానికి అందజేశారు. తొలుత స్నేహితుని మృతికి సంతాపం తెలియజేసి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు కర్రి భాస్కరరావు, మండలి హనుమంతరావు, ముంగర కృష్ణప్రసాద్, వల్లూరి రవి, టి.సుబ్బారావు, పి.జానకిరామ్, జంధ్యాల నాగేశ్వరరావు, సీహెచ్ రాజబాబు హాజరయ్యారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి: భార్యపై మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన సనకం నర్సింహస్వామి (48) తన భార్యతో మనస్పర్థల కారణంగా ఈ నెల 8వ తేదీ సోమవారం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు అతడిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ నర్సింహస్వామి మృతి చెందాడు. దీనిపై అతని కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రక్తదానం ఆరోగ్యానికి మేలు



స్థానిక షాదీఖానాలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న స్థానికులు

ఆకివీడు: రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యులు ఎండీ. బిలాల్ చెప్పారు. స్థానిక జమాతే ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ ఆధ్వర్యంలో శనివారం షాదీఖానాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయడం ద్వారా కొంత మంది ప్రాణాల్ని కాపాడవచ్చునన్నారు. రక్తం అత్యవసరమైన వారికి ఆయా గ్రూపు రక్తం ఎక్కించి ప్రాణాలు నిలుపుతున్న ఘటనలు అనేకం ఉన్నాయని చెప్పారు. రక్తదానంతో దేహంలో కొత్త రక్తం పుట్టుకు వస్తుందని చెప్పారు. శిబిరంలో 62 మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ అధ్యక్షుడు ఎస్‌డీ. ఫారూక్, డాక్టర్ ఏఎస్ఎన్.రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ.మస్తాన్‌వలీ, ఎండీ.జక్కీ అహ్మద్, లయన్స్ అహ్మద్, సంఘ సభ్యులు షహజాద్, మహబూబ్ జానీ, ఆరిఫ్, అతిఫ్, షబ్బీర్, అంజాద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం



సైబర్ నేరాల పట్ల అవగాహన బ్యానర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన అవసరమంటూ ఏర్పాటు చేసిన బ్యానర్లను శనివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని, ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్ డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు ట్రోల్ ఫ్రీ నంబర్ 1930కు డయల్ చేయాలని అన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, ఆర్ఆర్‌డీఎస్ కళాశాల అధ్యాపకుడు పి.అమూల్యరావు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని అన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే సొమ్ములు రికవరీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. సైబర్ క్రైమ్ సంబంధించి అవగాహన కల్పించడానికి ప్రతి కూడాలిలో బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.